www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -28 మంగళవారం12 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## భార్యకు గౌరవంగా జీవించే హక్కుంది

ఆమెను పశువులా చూడొద్దు

గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు



# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

## విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

విద్యార్థులకు రూ.వెయ్యి కోట్లతో 9 రకాల వస్తువులతో ఎడ్యుకేషన్ కిట్

నాణ్యత లేకుంటే ఆ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టి బొక్కలో వేస్తాం

ఉత్తమ టీచర్లకు జూన్ 2న, డిసెంబర్ 9న సన్మానం

ఏటా 500 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తాం

క్యూర్ పరిధిలో రూ.1700 కోట్లతో విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి

**హైదరాబాద్ మే 11 (ప్రజావినికిడి):** తెలంగాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్ది ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెట్టబోతున్నామని స్పష్టం చేశారు. టెన్త్ తర్వాత విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారనీ, దాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోనీ ఎల్బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను సీఎం**మిగతా 2లో...**





## గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

పోలవరం పెండింగ్ అంశాలను పరిష్కరించండి

తొలిదశ నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ, మే 11 (ప్రజావినికిడి):** పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.
2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. **మిగతా 2లో...**

## వైఫల్యానికి నిదర్శనం

బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై

రాహుల్ గాంధీ ఘాటు స్పందన

ఏడాది పాటు బంగారం కొనొద్దని,

ఇంటి నుంచే పనిచేయాలని సూచించిన మోదీ

ప్రతిసారీ బాధ్యతను ప్రజలపై నెట్టేస్తున్నారన్న రాహుల్



2లో.

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

: అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

1998 పోక్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు

సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని

బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ

సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి





# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

## సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో లోకేశ్ భేటీ

**అమరావతి, మే 11 (ప్రజావినికిడి):** సింగపూర్‌లోని పుంగోల్ తరహాలో అమరావతిలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జేఐఎస్‌సీ మద్దతుతో అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. **మిగతా 2లో...**

## ఇప్పటి వరకు చర్యలేవి?

: బండి భగీరథ్ అంశంపై డీజీపీని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి

8న ఫిర్యాదు వస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్న

కేసులో సమగ్ర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశం

కేసు వివరాలను సీఎంకు వివరించిన డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్ మే 11 (ప్రజావినికిడి):** కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రశ్నించారు **మిగతా 2లో...**

## గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 11 (ప్రజావినికిడి):** రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను లోక్ భవన్ లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కలిసారు. జూన్ 12 న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్ ను ఆహ్వానించారు. విద్యార్థులు పొగాకు, మద్యం ,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభలో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచన ను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి గవర్నన్‌ను సిఎం ఆహ్వానించేందుకు కలిసారు.


# రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు కృషి

పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆస్తకి

పరిశ్రమల శాఖ అధికారులతో సిఎస్ సమీక్ష

**హైదరాబాద్, మే 11 (ప్రజావినికిడి):** తెలంగాణ రైజింగ్ -2047 విజన్ లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం**మిగతా 2లో...**





# జులై 1 నుంచి వీబీ జీ రామ్ జీ చట్టం

గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ

కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు అంతరాయం కలగకుండా చర్యలు

కొత్త కార్డులు జారీ అయ్యే వరకు ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటు

**న్యూఢిల్లీ, మే 11 (ప్రజావినికిడి):** జీవనోపాది భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జులై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది.
దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల **మిగతా 2లో...**

# కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

**కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి**

**హైదరాబాద్,మే 11 (ప్రజావినికిడి):**:కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని



భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

**మొదటిపేజీ తరువాయి**

అలాగే, పలువురు కేంద్రమంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ క్రమంలోనే సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించి నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగు తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్ లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించు కోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జలశక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి సీంచాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునికీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-ఎఎ కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ లోపల క్యూర్ పరిధిలోని విద్యా సంస్థల్లో రూ.1700 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూవిద్యాసంస్థలు, యూనివర్సిటీలు విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం బలహీనపడుతుందని వివరించారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.

రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారు ముల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖను తన దగ్గర ఉంచుకున్నానని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు.

1.5 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు.12 వేల ప్రయివేటు స్కూళ్లలో 38 లక్షల మంది చదువుతున్నారని వివరించారు.ప్రయివేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటీ, ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్ర బడ్జెట్లో విద్యాశాఖకు ఎనిమిది శాతం నిధులను కేటాయించామన్నారు. దశల వారీగా విద్యకు 15 శాతం నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలబట్టడమే లక్ష్యమని ప్రకటించారు.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని అన్నారు.25 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యా విధానం పరిశీలనకు ఫిన్లాండ్‌కు పంపించామని వివరించారు.అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపిస్తామన్నారు.విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండున, తెలంగాణ తల్లి జన్మదినం డిసెంబర్ తొమ్మిదిన ఉత్తమ టీచర్లకు సన్మానం చేస్తామని వివరించారు.

పేద విద్యార్థులు ఆర్థాకలితో పాఠశాలలకు వస్తున్నారనీ,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పారు.పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామన్నారు.కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అద్భుతంగా అందిస్తున్నామని అన్నారు.ప్రభుత్వం పాఠశాల్లో చదవే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని చెప్పారు.తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని వివరించారు. విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు.100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. పేద బిడ్డలు ధైర్యంగా వాటిలో చదువుకున్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని చెప్పారు.పాఠశాలలు టీచర్లు, ఐఏఎస్‌లు, రాజకీయ నాయకుల కోసం కాదనీ, పేద విద్యార్థుల కోసం, వారి సంక్ష?మం కోసమని అన్నారు.ఏ నిర్ణయమైనా వెనకడుగు వేయకుండా తీసుకుంటామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే ఎడ్యూకేషన్ కిట్ నాణ్యతను తాను స్వయంగా పరిశీలించానని అన్నారు. ఎడ్యూకేషన్ కిట్ కోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.నాణ్యమైన వస్తువులు రాకపోతే తక్షణమే ప్రజా ప్రతినిధుల దృష్టికి తేవాలని సూచించారు. నాణ్యత లేని వస్తువులను సరఫరా చేస్తే కంపెనీలను బ్లాక్ లిస్టులో చేరుస్తామనీ, వారిని బొక్కలో వేయించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరైన సమయంలో విద్యార్థులకు చేరాలన్నారు.పాఠశాల ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు ఒక జత బట్టలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరో జత నెలాఖారున ఇవ్వాలని చెప్పారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకూ నూటికి నూరు శాతం మార్కులు రావాలన్నదే తన స్వప్నమని అన్నారు.టీచర్లకు మొదటి తారీఖున జీతంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించే బాధ్యత తనదని చెప్పారు.

ప్రభుత్వ టీచర్లది ఉద్యోగం కాదనీ, భావోద్వేగమనీ, అది బరువు కాదనీ బాధ్యత అని అన్నారు.19 లక్షల మంది విద్యార్థుల కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు.పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కండ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలని కోరారు.విద్యాశాఖకు మంత్రి లేరని కొందరు మాట్లాడుతున్నారనీ, సమీక్ష సమయంలో తనను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యా శాఖ మంత్రిగా చూడాలని కోరారు. మంచి విద్యను అందించాలనీ, ఉత్తమ పౌరులను తయారు చేయాలని సూచించారు. త్వరలోనే విద్యా శాఖలో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, సలహాదారులు కె కేశవరావు, హర్కర వేణుగోపాల్, వీహెచ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ యాదవ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు .

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

**: అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**

**(ప్రజావినికిడి):**

భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోక్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోక్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు.

సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక



స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు.

పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

# భార్యకు గౌరవంగా జీవించే హక్కుంది

**న్యూఢిల్లీ, మే 11 (ప్రజావినికిడి):**

భార్యను పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గృహహింస కేసు విచారణలో భాగంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌పై విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఆ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితుడు మద్యం మత్తులో ఆ మహిళపై దాడి చేశాడని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు బలంగా గాయమైనట్టు, ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలైన మొదటి భార్య వాదనలు విన్న న్యాయస్థానం.. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

**మొదటిపేజీ తరువాయి**

ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాజధాని అమరావతికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సింగపూర్ ద్వారా ఆగ్నేయ ఆసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తామని లోకేశ్ చెప్పారు. ఆంధప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య ఇప్పుడు పటిష్ఠ భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. ఎంవోయూలోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు ఇటీవల సింగపూర్‌లో వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారని గుర్తుచేశారు.

# జులై 1 నుంచి వీబీ జీ రామ్ జీ చట్టం

**మొదటిపేజీ తరువాయి**

చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ–కేవైసీ ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర అంశాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది

# వైఫల్యానికి నిదర్శనం

**బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఘాటు స్పందన**

**న్యూఢిల్లీ, మే 11 (ప్రజావినికిడి):**

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు.

సోమవారం నాడు ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ.. "నిన్న మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు.. వైఫల్యానికి రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు.**ప్రధాని విజ్ఞప్తి ఇదే.. :**హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# ఇప్పటి వరకు చర్యలేవి?

**.మొదటిపేజీ తరువాయి**

ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాలని డీజీపీని ఆదేశించారు. కేసులో సమగ్ర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉన్నారని డీజీపీ సమాధానం చెప్పారు. కేసు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు.బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు అంశంపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. సీపీ నుంచి కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి పూర్తి వివరాలు తెప్పించుకున్నారు. విచారణ కోసం ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు. కాగా, తన కుమార్తెను బండి భగీరథ్ వేధిస్తున్నారంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్‌విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల క్రింద శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. మరోవైపు, బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం తనను బెదిరిస్తున్నారని శుక్రవారమే భగీరథ్ కరీంనగర్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదైంది.

# రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు కృషి

**.మొదటిపేజీ తరువాయి**

సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్ టైల్ పార్కులు, ఐటి పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ –2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు.

అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# మండలంలో మొదలైన జనగణన

**వాజేడు మే,12,(ప్రజావినికిడి):**కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 11,సోమవారం నుండి జూన్ 9,వరకు జనగణన. నిర్వహిస్తున్నట్లు ఈ జనగణనలో అందరు పాలుపంచుకోవాలని అధికారులు కోరుచున్నారు. తెలంగాణలో మన జనగణన,మన అభివృద్ధి,అనే నినాదంతో సాగుతుంది ఈ జనగణనలో గ్రామాల్లో అధికారులు గృహల జాబితా గృహాలో నివసించే జనభా గణన జరిగుతుంది మే 11నుండి జూన్ 9 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ముఖ్యంగా కుటుంబం గురించి ప్రాథమిక సమాచారం, ప్రజల సౌకర్యాలు, ఆస్తుల వివరాలు, మొబైల్ నెంబర్ జనగణన సమాచారం కోసం, మీ వద్దకు వచ్చే అధికారులకు కుటుంబ సమాచారం వివరాలు తమకు తెలియజేసి ప్రజలంతా ఈ జనగణన కార్యక్రమానికి సహకరించాలని వారు కోరారు.

# తెలంగాణ విద్యాశాఖ విద్య వారోత్సవాలు








**వాజేడు,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాలు ప్రజా ప్రతినిధులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థుల భాగస్వామ్యంతో ఈనెల 11 నుండి17,వరకు నిర్వహించనున్న ఏడు రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాజేడు నాగారం స్కూల్ ప్రాంగణం తరగతి గదులు ప్రయోగశాలలు టాయిలెట్లు శుభ్రపరచడం జరిగింది. తదనంతరం మండల విద్యా వనరుల కేంద్రం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులచే సమావేశము ఏర్పాటు చేసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని సూచించడం జరిగినది ఈ ఏడు రోజుల రోజువారి కార్యక్రమ డాక్యుమెంటేషన్ తయారుచేసి సమర్పించాలని సూచించడం జరిగినది ఈనెల,13 నాడు జిల్లాస్థాయిలో సర్పంచులు,ప్రజా ప్రతినిధుల తో వర్క్ షాప్ ఉంటుందని తెలియపరచ నైనది ఈ కార్యక్రమంలో వాజేడు సర్పంచ్ బొదెబోయిన స్వరూప మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు..

**శేరిలింగంపల్లి అక్రమ నిర్మాణాలపై సూరన్న సమరశంఖం.. -అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ..**











**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
జిహెచ్ఎంసి అధికారుల అవినీతి అక్రమాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు ప్రధాన భవనాలపై ఇప్పటికే 'ప్రజావాణి'లో సూరన్న ఫిర్యాదు చేశారు.ఈ అక్రమ కట్టడాల వల్ల ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కడమే కాకుండా స్థానిక ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఈ మూడు భవనాల వ్యవహారంలో పక్కా ఆధారాలతో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారుల హస్తం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి.

మున్సిపల్ కమిషనర్ స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి పై వస్తున్న అనేక ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించి,సదరు భవనాల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు వల్ల వ్యవస్థ భ్రష్టు పడుతోందని ప్రజావాణిలో అందిన అక్రమ భవనాల ఫిర్యాదులను బుట్టదాఖలు చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన సూరన్న కమిషనర్ ను కోరారు.

ఈ అక్రమాలపై సూరన్న రాజీలేని పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించకుంటే, బాధితుల పక్షాన నిలబడి అధికారుల అంతు చూసే వరకు సూరన్న విశ్రమించిననీ హెచ్చరించారు. ఒక్కొక్క టౌన్ ప్లానింగ్ అధికారి కూడబెట్టిన కోట్లకొద్ది అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని,అక్రమ నిర్మాణాల పునాదులు కదిలిస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ అధికారుల అవినీతితో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంటే చూస్తూ ఊరుకోలేము. ముఖ్యంగా ఈ మూడు భవనాల విషయంలో కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలి. అవినీతి అధికారుల అండతో సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యాన్ని కూల్చివేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిపై ఉక్కుపాదం మోపుతుంటే, శేరిలింగంపల్లి అధికారులు మాత్రం పాత పద్ధతుల్లోనే భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారుసూరన్న నేతృత్వంలో సాగే ఈ పోరాటం ద్వారా,అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారుల అసలు స్వరూపాన్ని బయట పెడతామన్నారు. ఇకనైనా అధికారులు తమ తీరు మార్చుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నాము.

# బండి భగీరథ్ వ్యవహారంలో ప్రభుత్వం మౌనం వీడాలి

**మహిళల భద్రతపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి**

**బండి భగీరథ్ పై తక్షణ చర్యలు తీసుకోవాలి**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు.మైనర్ బాలికకు మద్యం త్రాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసు అత్యంత తీవ్రమైనదని, ఇలాంటి ఘటనల్లో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా చట్టం తన పని తాను చేసుకోవాలని అన్నారు. బాధితురాలికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.పోక్సో వంటి తీవ్రమైన కేసుల్లో ఆలస్యం చేయడం సమాజానికి తప్పు సంకేతాలు పంపినట్టేనని, నిందితుడు ఎవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలని అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. అలాగే ఈ కేసులో నిజాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడకూడదని ఆయన అన్నారు.

# బండి భగీరత్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**కేశంపేటలో బీఆర్ఎస్ నిరసన**



**కేశంపేట,(ప్రజావినికిడి):**
కేశంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేశంపేట పోలీస్ స్టేషన్లో పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మైనర్ బాలికకు సంబంధించిన ఇలాంటి తీవ్రమైన కేసులో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. నిందితుడు ఎవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్లాస్ ఖాన్‌పేట సర్పంచ్ హరిశేఖర్ యాదవ్, చింతకుంటపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్,మాజీ వైస్ ఎంపీపీ సురేందర్ కొత్తపేట మాజీ సర్పంచ్ నవీన్ కుమార్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జమాల్ ఖాన్,మాజీ సర్పంచ్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు సాజిద్,రామకృష్ణ, సత్యనారాయణ, దశరథ్,నాగేష్, రాజు,దండే రమేష్, యాదయ్య, అమరేష్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోపణలు వచ్చినంత మాత్రాన ఎవరు తప్పు చేసినట్లు కాదు..!

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,షాద్ నగర్ సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ను కలుసుకున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై ఇటీవల వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాము అంటూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,షాద్ నగర్ సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం కరీంనగర్ లో బండి సంజయ్ గృహానికి వెళ్లి ఆయనను కలుసుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలోని సారాంశం ఏమిటంటే..? పోలీసుల దర్యాప్తు ఇంకా పూర్తికాకముందే, కోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వకముందే కొందరు రాజకీయ లాభాల కోసం కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం చాలా బాధాకరం. ఆరోపణలు వచ్చినంత మాత్రాన ఎవరు తప్పు చేసినట్లు కాదు.మన దేశంలో బలమైన న్యాయ వ్యవస్థ ఉంది,కోర్టులు ఉన్నాయి,చట్టం ఉంది.నిజం ఏదైనా ఉంటే దర్యాప్తు సంస్థలు మరియు కోర్టులే నిర్ణయిస్తాయి.దర్యాప్తు పూర్తికాకముందే ఒక ప్రజా నాయకుడిని దోషిగా చిత్రీకరించడం, వ్యక్తిత్వ హననం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.రాజకీయ కక్షలతో ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం తగదు. ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ, తెలంగాణలో బిజెపి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు బండి సంజయ్ అన్న. ప్రజా సమస్యలపై ఎప్పుడూ ముందుండే నాయకుడిపై ఇలాంటి ఆరోపణలతో ప్రజల్లో అపోహలు సృష్టించాలని ప్రయత్నించడం దురదృష్టకరం.బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారి సమక్షంలో, షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన దాదాపు 50 మంది నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి మేము కరీంనగర్‌కు వెళ్లి బండి సంజయ్ అన్నను మర్యాదపూర్వకంగా కలిశాము.సుమారు గంటసేపు జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,ప్రజా సమస్యలు,పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజలకు మరింత దగ్గరగా పనిచేసే అంశాలపై విస్తృతంగా చర్చించాము.ఈ సందర్భంగా మేమంతా బండి సంజయ్ అన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటించాము.

ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే నాయకత్వానికి షాద్‌నగర్ బిజెపి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలు ఎంత చేసినా సత్యాన్ని ఎవరూ ఆపలేరు.చివరికి నిజమే గెలుస్తుంది, ధర్మమే నిలుస్తుంది.దేశం కోసం సేవ ప్రజల కోసం పోరాటం..షాద్‌నగర్ నుండి కరీంనగర్ వరకు బండి సంజయ్ అన్నకు సంపూర్ణ మద్దతు

దర్యాప్తు పూర్తయ్యే వరకు ఓపికగా ఉండాలి. కోర్టు తీర్పే తుది నిర్ణయం..

# తెలంగాణ జన సమితి ప్లీనరీని విజయవంతం చేయాలి

**: తెలంగాణ జన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు భద్రగామ ఆంజనేయులు**



**ఉప్పల్,(ప్రజావినికిడి):**తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యంగా , సామాజిక న్యాయం, ప్రజాస్వామిక విలువలు,సమాన అభివృద్ధి కోసం టిజెసి రథసారథి, తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం నేతృత్వంలో పని చేస్తుందని తెలంగాణ జన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు భద్రగామ ఆంజనేయులు అన్నారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం కృషి చేస్తున్న తెలంగాణ జన సమితి రాష్ట్ర 4 వ ప్లీనరీ ఈనెల పన్నెండున హైదరాబాదు నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ వేదికగా జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ఉద్యమకారులు, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లీనరీని విజయవంతం చేయవలసిందిగా ఆంజనేయులు పిలుపునిచ్చారు.

# షాద్ నగర్ లో వీళ్లేంటో...

# వీళ్ళ విధానాలేంటో..?

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి కేసులో కాంగ్రెస్ మౌనవ్రతం..**

**సిపిఐ,సిపిఎం, తెలుగుదేశం బీఎస్పీలది అదే దారి..**

**బిజెపి నేతలూ.. మౌనమేల..?**

**బీఆర్ఎస్ నాయకుల ఒంటరి పోరాటం..**

**బాధ్యత మరిచిన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు..**

**క్యాంపు కార్యాలయమే ప్రపంచమా.. మహిళల ఘోష పట్టించుకోరా..?**

**జరిగింది ఘోరం..ఎందుకీ తాత్సారం..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ చిన్న తప్పు చేసినా బిజెపి నాయకులు రెచ్చిపోతుంటారు.సోషల్ మీడియాలో, వాట్సాప్ యూనివర్సిటీలో నానా రచ్చ చేస్తుంటారు.. కానీ అవతలి పార్టీ తప్పు చేసిన సందర్భం దేశవ్యాప్తంగా జనాలను కుదిపేస్తున్నప్పటికీ కాంగ్రెస్ నాయకులకు చీమకుట్టినట్టు కూడా లేదు. మన్ను తిన్న పాములా క్యాంపు కార్యాలయానికే పరిమితమై కూర్చున్నారు.. ఒకవైపు బీఆర్ఎస్ నాయకులు బిజెపిని దుమ్ము దులిపేస్తుంటే, పోలీస్ స్టేషన్ వెళ్లి ఫిర్యాదులు చేస్తుంటే వీళ్లు మాత్రం తమకేమీ తెలియనట్టు.. అసలు ఏమీ జరగనట్లు యదార్థంగా ఉన్నారు..వీళ్ళని చూస్తుంటే అయితే నాకేంటి.. నాకేంటని..అన్న కొండ వలస డైలాగు గుర్తుకొస్తుంది.. అధికార పార్టీకి బాధ్యత లేదా.. ఉన్నా మర్చిపోయారా.. వీళ్ళు మాత్రమే కాదు..బీఆర్ఎస్ మినహా మిగతా పార్టీలది కూడా అదే దారి.. మహిళల పట్ల వీళ్ళకి ఎందుకు ఇంత చులకన భావం..షాద్ నగర్ నియోజకవర్గాన్నే తీసుకుందాం..

**మౌనమే నీ భాష ఓమూగ మనసా..**

అన్నట్టుగా ఉంది షాద్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పరిస్థితి. సరే..ఎమ్మెల్యే వరస రాజధానుల పర్యటనలతో బిజీగా ఉన్నాడు అనుకుందాం.. స్థానికంగా ఉన్న ఇతర నాయకులకు ఏమైంది..? మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మొదలుకొని సీనియర్ నాయకులు పార్టీలో ఎంతోమంది ఉన్నారు. నిత్యం క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే దర్శన భాగ్యం కోసం ఎదురుచూసే ఈ నాయకులకు అవతలి పార్టీలు తప్పు చేసినప్పుడు కనీసం ఒక కౌంటర్ ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉండదు.తమను ప్రత్యేకించి ఎవరైనా ఏమైనా అంటే విరుచుకుపడడం మాత్రం తెలుసు. కానీ ఒక మైనర్ బాలికపై అత్యాచారం,అది సాక్షాత్తు బిజెపి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సామాన్యులు, ఇండిపెండెంట్ జర్నలిస్టులు సైతం దీనిపై స్పందిస్తూ సోషల్ మీడియాలో దుమ్ము దులుపుతున్నారు. కానీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి విలేకరులు అడిగితే గానీ దీనిపై స్పందించలేదు. చివరకు తిరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని పార్టీకి నష్టం జరగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా సిట్ ఏర్పాటు చేశారు. ఇక షాద్ నగర్ నియోజకవర్గంలో కూడా ఇప్పటిదాకా దీనిని ఖండిస్తూ కాంగ్రెస్ నాయకుల నుంచి ఒక్క స్టేట్మెంట్ కూడా లేదు. ఇక బీఆర్ఎస్ నాయకులు రాజా వరప్రసాద్, రాంబాల్ నాయక్ లాంటివాళ్ళు బండి సంజయ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని గట్టిగానే ప్రశ్నించారు. ఇంకోవైపు ఎమ్మెస్ నటరాజన్ తదితర నాయకులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి బండి సంజయ్ కుమారుడిపై ఫిర్యాదు కూడా చేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కిషోంపేటలో మరి కొంతమంది నాయకులు ఈ వ్యవహారంపై మీడియా ముఖంగా ప్రశ్నించారు.కానీ కాంగ్రెస్ లో గల్లీ లీడర్ తో మొదలుపెట్టి, నియోజకవర్గ నాయకుల దాకా ఒక్కరు కూడా దీనిపై స్పందించకపోవడం విడ్డూరం. కాంగ్రెస్ నాయకులు ఇంత నీరసంగా ఉన్నారు.కాబట్టే బిజెపి అవకాశం వచ్చినప్పుడల్లా ఈ పార్టీతో ఆడుకుంటుంది. ఇదే సంఘటన ఒకవేళ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి నాయకుల వల్ల జరిగి ఉంటే బిజెపి ఈపాటికి ఎంత రచ్చ చేసేదో ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. కానీ అధికారం చేతిలో ఉన్నా,మాట్లాడే సామర్థ్యం ఉన్నా కాంగ్రెస్ నాయకుల్లో చలనం లేకపోవడం చూస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బండి సంజయ్ కి పరోక్షంగా మద్దతు ఇస్తున్నాడు అనే విమర్శలకు బలం చేకూరుతుంది. కాంగ్రెస్ నాయకులూ.. ఇకనైనా కళ్ళు తెరవండి..




**వామపక్షాలకు ఏమైంది..?**

కార్మికులైన, కూలీలైన, మహిళలైనా అన్యాయానికి గురైతే ఉవ్వెత్తున ఎగిసిపడే వామపక్షాలు కూడా ఈ విషయంలో నిరసించి పోవడం చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బండి సంజయ్ కుమారుడి సంఘటన మూడు రోజులుగా ఎక్కడ చూసినా సంచలనం సృష్టిస్తుంది. సామాన్యుల సైతం దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.కానీ ఆందోళనల మాట అటు నుంచి సిపిఎం గానీ, సిపిఐ గాని, చివరకు బిఎస్పీ గాని ఇప్పటిదాకా ఒక స్టేట్మెంట్ కూడా ఇవ్వలేదు.. ఇక వీళ్ళ పోరాటాలకు, వీళ్ళ ఆశయాలకు అర్థమేముంది. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే మాట్లాడాలి అనుకుంటే ఇలాంటి సమయంలో మహిళలకు రక్షణగా ఉండేది ఎవరు..? వాళ్ల తరపున పోరాటం చేసేది ఎవరు..? వారి గోడు పట్టకపోతే ఇక రాజకీయాలు ఎందుకు..? ఈ ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి పార్టీలకు ఎదురవుతున్నాయి. దీనికి ఒక్క పార్టీ దగ్గరైనా సమాధానం ఉందా..?

**తెలుగు తమ్ముళ్లు ఎక్కడ..?**

ఈ మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ గ్రామాల్లో పుంజుకుంటుంది. తాజా పరిణామాలపై అప్పుడప్పుడు స్పందిస్తూ అధికార పార్టీ అయినా ప్రతిపక్షమైన ఎవరైనా సరే తప్పులు జరిగితే నిలదీసేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధంగా ఉంటారు. ఈ మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ సమావేశాన్ని కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి భవిష్యత్తు రాజకీయ ప్రణాళికలకు బీజం పోసింది. ప్రస్తుతం కేంద్రంలో బిజెపితో తెలుగుదేశం పార్టీ అంట కాగుతుంది. అయితే ఏది ఏమైనా తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అని చెప్పే నాయకులు ఈ ప్రాంతంలో ఉన్నారు. ఇలాంటి పరిణామాలపై మౌనం వహిస్తే జనాల్లో ఇలాంటి సంకేతాలు వెళ్తాయి అన్నది ప్రశ్నార్థకం..?

**ధర్మ రక్షకులు ఎక్కడ..?**

తమను తాము ధర్మ రక్షకులుగా చెప్పుకునే భారతీయ జనతా పార్టీ,ఇతర విభాగాల నాయకులు కూడా బండి సంజయ్ కుమారుడి వ్యవహారంలో ఇప్పటిదాకా ఎలాంటి స్పందన చూపించలేదు. తమ పార్టీలోని సాక్షాత్తు కేంద్ర మంత్రి కుమారుడు ఈ సంఘటనకు సంబంధించి కేసులో చిక్కుకున్నప్పుడు అందులో వాస్తవాలు ఉన్నాయా..అవాస్తవాలు ఉన్నాయా.. అన్న విషయాన్ని ప్రజల ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత బిజెపి నాయకుల పైన కూడా ఉంది. కానీ మోదీ వస్తున్నారంటూ తెగ ప్రచారం చేస్తూ పత్రికా ప్రకటనలు ఇస్తూ వారం రోజుల నుంచి హడావిడి చేసిన బిజెపి నాయకులు ఈ విషయంలో మాత్రం మౌనంగా ఉండిపోయారు. మౌనం అనేది నేరాన్ని అంగీకరించినట్లే అవుతుంది. కాబట్టి దీనిని దృష్టిలో పెట్టుకొని బిజెపి నాయకులు కూడా బయటకు వచ్చి నిజా నిజాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. మహిళా రక్షణ, భేటీ బచావో, భారత్ మాతాకీ జై లాంటి నినాదాలకు పరిమితమైపోకుండా ఈ ధర్మ పరిరక్షకులు కూడా ముందుకు వస్తే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయి. భారత్ మాత అంటే సాక్షాత్తు మహిళ అని మర్చిపోయినట్టున్నారు. నాయకులారా.. ఇకనైనా కళ్ళు తెరవండి.. బాధితులకు అండగా నిలవండి..

---

# మహిళల అభ్యున్నతి మన అందరి లక్ష్యం..

## షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్"..

**మహిళలతోనే కుటుంబాలు బాగుపడతాయి..**

**అందే మోహన్ నిరంతరం అండగా ఉంటాడు..**

**మహిళలకు ఎలాంటి సహకారం అందించేందుకు అయినా సిద్ధం..**

**ఆలియా సుల్తానా బేగం ఆధ్వర్యంలో 90 రోజుల శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేత..**

**అందెమోహన్ సహకారంతో మహిళలకు ఉచిత శిక్షణ**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మహిళల అభ్యున్నతే లక్ష్యంగా సేవాభావంతో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలి..చిన్న అవకాశం దొరికిన అందిపుచ్చుకొని కుటుంబాలను నడిపించే మహిళల కోసం ప్రతి ఒక్కరూ అండగా నిలబడాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ మండల కేంద్రంలో గల 14వ వార్డులో మగ్గం, బ్యూటీషియన్, టైలరింగ్, మెహంది డిజైన్స్ రంగాలలో 90 రోజులపాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని అలియా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అందేమోహన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా ఈ శిక్షణను అందించారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన 68 మంది మహిళలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మున్సిపల్ చైర్మన్ అగునూరు బస్వం,వైస్ చైర్మన్ అందేమోహన్ ల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. స్వయం ఉపాధి కింద వీళ్లకు పనులు కూడా లభించేలా సహకారం అందించనున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

### మహిళల భవితకు మంచి మార్గం.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

టైలరింగ్,మగ్గం, బ్యూటీషియన్ వంటి రంగాలలో 90 రోజులపాటు మహిళలకు శిక్షణ ఇవ్వడం మహిళల భవితవ్యానికి మంచి మార్గాన్ని చూపించడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.గత 30 ఏళ్లుగా ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తున్న అలియా సుల్తానాను ఆయన అభినందించారు. అప్పటినుంచి తనకు తోచిన సేవలు అందిస్తున్నానని అన్నారు.ఇప్పుడు తన వార్డులో స్వయంగా బాధ్యతలను భుజం మీద వేసుకొని మహిళలను ఉపాధి దిశగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తున్న మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అందె మోహన్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కష్టపడి కుటుంబాన్ని ముందుకు నడిపించాలనుకునే మహిళలకు సహకరించడం ఎంతో అవసరం అన్నారు.ఈ మహిళల సహకారంతోనే అందెమోహన్ ఎన్నికలలో ఘనవిజయంగా సాధించాడని, ఆర్థికంగా కూడా పార్టీకి ఎంతో సహకారాన్ని అందించారని ప్రశంసించారు. అందె మోహన్ ఇక్కడ మహిళ ఉపాధికి ఆర్థికంగా అండగా ఉంటాడని, అతనికి ఏదైనా ఇబ్బంది ఉంటే తాను కూడా సహకరిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఎలాంటి కార్యక్రమానికైనా తన అండదండలు ఉంటాయని ఆయన వెల్లడించారు.



కుటుంబ బాధ్యతను సమర్థవంతంగా మోయగలిగేది మహిళలు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో వారికి అవసరమైన ఉపాధి మార్గాల వైపు వారిని ముందుకు నడిపిస్తానని స్పష్టం చేశారు. మహిళలకు ఏ ఇబ్బంది వచ్చినా సోదరుడిగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.నేతలు ముబారక్ అలీ ఖాన్,జమ్రుద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### సోదరుడిగా ఉంటా..కష్టాలు వింటా..

**మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అందెమోహన్**

14వ వార్డులో ఉన్న ప్రతి మహిళకు సోదరుడిగా ఉంటానని,వారి కష్టాలు వింటానని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అందెమోహన్ అన్నారు.తన వార్డులోని మహిళలు ఉపాధి దిశగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టానని వెల్లడించారు. భవిష్యత్తులోనూ పూర్తిస్థాయిలో వారికి అన్ని విధాలా అండగా ఉంటానని వెల్లడించారు.



---

# అనధికార వార్తలను పట్టించుకోవద్దు

## శ్రీకోసగుండ్ల ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రతిష్టాపకులు, ప్రధాన పూజారి కోమండూరి శేషాచారి విజ్ఞప్తి



**చైతన్యపురి, (ప్రజావినికిడి)**
శ్రీకోసగుండ్ల ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌కు సంబంధించిన వార్తలు 11-05-2026 తేదీన కొన్ని దినపత్రికల్లో ప్రచురితమైన నేపథ్యంలో దేవస్థానం ప్రతిష్టాపకులు, ప్రధాన పూజారి కోమండూరి శేషాచారి స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ దేవస్థానం యాదాద్రి దేవస్థానం దత్తత ఆలయమని, ఆలయానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటనలు తాను గానీ, యాదాద్రి దేవస్థానం గానీ, దేవాదాయ శాఖ కమిషనర్ గానీ విడుదల చేయలేదని స్పష్టం చేశారు. ఎవరి అనుమతి లేకుండా వచ్చిన ఈ వార్తలు పూర్తిగా అనధికారికమని తెలిపారు. కాబట్టి భక్తులు, ప్రజలు ఇటువంటి వార్తలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇకముందు దేవస్థానానికి సంబంధించిన వార్తలు ప్రచురించే ముందు తప్పనిసరిగా తనను సంప్రదించాలని పత్రికా సంపాదకులకు కోరారు.

# ఘనంగా భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ అంతర్జాతీయ సదస్సు




**ఉప్పల్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్ ఉప్పల్ లో భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరిశోధనలో సృజనాత్మకత, ఆవిష్కరణ అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. పరిశోధనలో సృజనాత్మకత మరియు ఆవిష్కరణ అన్న అంశంపై నిర్వహించిన ఈ సదస్సును విశిష్ట అతిథులు గా భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (BESTIU) గౌరవ చాన్సలర్ డా. రూపా వాసుదేవన్,వైస్ చాన్సలర్ డా.కె. నాగజ్యోతి, సైంటిఫిక్ చైర్ డా. ఆశుతోష్ శర్మ, ముఖ్య అతిథి నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డా.గోపాల్ లాల్,గౌరవ అతిథి సిప్స్,సిఐపిఎస్ఎఎస్ సి ఐ డైరెక్టర్ డా.వల్లి మణికం లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిశోధన అనేది కేవలం జ్ఞానం సంపాదించడానికే పరిమితం కాకుండా, అందులో కొత్తదనం అదేవిధంగా ఆవిష్కరణ ఉంటేనే అది సమాజానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గత ఆరు సంవత్సరాలుగా ఈ సదస్సును విజయవంతంగా నిర్వహిస్తున్నామనీ,పరిశోధనలు సమాజ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపేలా ఉండాలని, ఆవిష్కరణల ద్వారానే భవిష్యత్ అభివృద్ధి సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు సదస్సులో భాగంగా సాంకేతిక సెషన్లు,పేపర్ ప్రెజెంటేషన్లు, ప్యానెల్ చర్చలు నిర్వహించగా,దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వినూత్న ఆలోచనలు, పరిశోధన పత్రాలను ప్రదర్శించారు. అనంతరం పేపర్ ప్రెజెంటర్లకు, పరిశోధకులకు సర్టిఫికెట్లు అందజేసి పరిశోధన అలాగే ఉన్నత విద్య రంగాల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా ఈ అంతర్జాతీయ సదస్సు నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# 200 గజాల స్థలంలో 8 అంతస్తులు, అక్రమ సెల్లార్..




**గోషామహల్‌లో అక్రమ నిర్మాణాల అడ్డా.. -టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనానికి కారణం మామూళ్లేనా.?**

**జిహెచ్ఎంసి అధికారుల కనుసైగల్లోనే భారీ నిర్మాణాలు ఒక్కో నిర్మాణం వద్ద 10 లక్షలకు తగ్గేదే లేదట.?**

**"మీడియా"ని అడ్డం పెట్టుకొని చక్రం తిప్పుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..**

**నాంపల్లి,(ప్రజావినికిడి):**
గోషామహల్ సర్కిల్-30 పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, ప్రజల ప్రాణాలు అన్నీ పక్కనబెట్టి బిల్డర్లతో చేతులు కలిపిన కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు కోట్ల రూపాయలు దండుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పేరు ఇప్పుడు గోషామహల్ సర్కిల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. "డబ్బు ఇస్తే ఏ అక్రమ నిర్మాణానికైనా సార్ గ్రీన్ సిగ్నల్" అనే స్థాయిలో వ్యవహారం నడుస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

### 200 గజాల్లో 8 అంతస్తులు, అధికారులకు కనిపించలేదా.?

మంగళ్ హాట్‌లోని ప్రకాష్ టాకీస్ ఎదురుగా ఇంటి నెంబర్ 13-1-12/10 వద్ద సుమారు 200 గజాల స్థలంలో ఏకంగా 8 అంతస్తుల భారీ నిర్మాణం కొనసాగుతుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సుమారుగా 10 ఫీట్ల సన్నని గల్లీలో ఇంత భారీ నిర్మాణం ఎలా అనుమతించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికుల మాటల్లో చెప్పాలంటే "పర్మిషన్ కేవలం స్టిల్ ప్లేస్ టు కు మాత్రమే తీసుకొని ఏకంగా 8 అంతస్తులు నిర్మించారంటే డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్, ఏసీపీ బాలస్వామి, సెక్షన్ ఆఫీసర్ మహేందర్ అవినీతి ఎంత తీవ్రస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ అంతస్తులు,



నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు, భవిష్యత్తులో గోదాములుగా ప్రమాదకర నిర్మాణాలు" అన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయట.
ఇంత భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం ఒక నోటీసు కూడా ఇవ్వకపోవడం పై అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా పేదవాడు చిన్న ఇల్లు వేసుకున్నా నిబంధనల పేరుతో వెంటనే కూల్చివేత లు చేసే మున్సిపల్ సిబ్బంది అధికారులు, ఇక్కడ మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారు.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షల వసూళ్లా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం ఇదే గల్లీలో అనేక సెల్లార్లతో అక్రమ నిర్మాణాలకు జరుగుతుంటే స్థానికుల ఫిర్యాదులను పక్కనబెట్టడం, చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు ఫైళ్లు క్లోజ్ చేయడం కోసం సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పూర్తిస్థాయిలో అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారు అని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఒక్కో నిర్మాణం నుంచి రూ. 10 లక్షలకుపైగా వసూల్ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గోషామహల్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల సంఖ్య తీవ్రంగా పెరగడానికి ప్రధాన కారణం అధికారులకు భారీగా ఇస్తున్న మామూళ్ల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### డబ్బు ఇస్తే చాలు,ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చు

సెక్షన్ ఆఫీసర్ మహేందర్ ఏసీబీ బాలస్వామి కి మామూళ్లు ఇస్తే ఎన్ని అంతస్తులైన కట్టుకోవచ్చనే ధైర్యం బిల్డర్లకు ఎక్కడి నుంచి వస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెళ్లినా స్పందన లేకపోవడం వెనుక పెద్ద స్థాయి అవినీతి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏసీపీ,డిప్యూటీ కమిషనర్ మౌనం వెనుక వాటాల వ్యవహారమా.?మంగళ హాట్ లోని ప్రకాష్ టాకీస్ దగ్గర భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్రపైనా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. "సెక్షన్ ఆఫీసర్ మహేందర్ స్థాయిలో ఇంత భారీ అక్రమాలు జరిగితే ఉన్నతాధికారులకు తెలియకుండా ఎలా ఉంటుంది.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఏసీపీ, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులకు కూడా వాటాలు అందుతున్నాయా.? అందుకే చర్యలు తీసుకోవడం లేదా.? మరి గోల్కొండ జోనల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కూడా ఎందుకు మౌనంగా ఉన్నారు.? అనే చర్చ స్థానికులలో జోరుగా సాగుతోంది.
అక్రమ నిర్మాణాలపై మీడియా కథనాలు వస్తున్నా, ఫిర్యాదులు అందుతున్నా క్షేత్ర స్థాయిలో అధికారులు వెళ్లి పరిశీలించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.టౌన్ ప్లానింగ్ అధికారులు "చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక కారణమేంటి.?" అని ప్రజలు నిలదీస్తున్నారు. అక్రమ సెల్లార్లు, అక్రమ అంతస్తులు, అక్రమంగా గోదాములలో

### భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది.?

ఇరుకైన గల్లీలు, పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న అత్యంత భారీ భవనాలు భవిష్యత్తులో పెను ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అక్రమ సెల్లార్లలో గోదాములు నిర్వహిస్తే అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ ఇంజన్లు కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితి,ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి గోషామహల్ సర్కిల్-30 పరిధిలో జరిగిన అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ ప్రాంతం అక్రమ నిర్మాణాల కేంద్రంగా పూర్తిస్థాయిలో మారిపోతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



# సనత్‌నగర్ టిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు

**అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశం**



**హైదరాబాద్,మే 11 (ప్రజావినికిడి):** పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌పై మంత్రి సోమవారం రివ్యూ చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్‌లో భాగంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా.. ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ డిపార్ట్‌మెంట్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ట్రయల్ రన్‌లో భాగంగా 22 డిపార్ట్‌మెంట్లలో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్ , ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ పూర్తి అయిందని తెలిపారు. ట్రయల్ రన్‌లో భాగంగా టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్లు, వారి అటెండెంట్లకు భోజన సదుపాయం కల్పించాలని, అటెండెంట్ల కోసం ధర్మశాలను సైతం సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

# చట్టం ముందు అందరూ సమానమేనా..?

**బండి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి -షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ నిరసన.. పోలీసులకు వినతిపత్రంఅందజేత**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై మైనర్ బాలికకు మద్యం త్రాగించి అత్యాచారానికి పాల్పడినట్లు నమోదైన పోక్సో కేసులో ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఈ ఘటనను నిరసిస్తూ షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేయడం జరిగింది.చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బండి సంజయ్ మధ్య ఉన్న రాజకీయ దోస్తీ కారణంగానే చర్యలు ఆలస్యమవుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని నాయకులు విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ పార్టీ అధ్యక్షులు నటరాజన్,లక్ష్మణ్ నాయక్,మాజీ ప్రధాన కార్యదర్శి రవి యాదవ్, కౌన్సిలర్లు గోపాల్, ఎస్పీ శివ,మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, జూపల్లి శంకర్, మాజీ ఎంపీటీసీ బిశ్వ రామకృష్ణ, నాయకులు బిక్షపతి, రాఘవేందర్, నడికూడ అశోక్, ప్రభాకర్,అజ్వార్, మినాజ్,షబ్బీర్, మహమూద్, ఇర్ఫాన్,రఘు, తేజ,నాని తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా బీరప్ప స్వామి కామరాతి దేవి కళ్యాణ మహోత్సవం

**ఇబ్రహీంపట్నం, (ప్రజావినికిడి):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తొర్రూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ బీరప్ప స్వామి కామరాతి దేవి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవాలయం వద్ద ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేసి,వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.
ఈ మహోత్సవానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల అభివృద్ధి శాఖ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అభిషేక్ రెడ్డి,అన్ని పార్టీల స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ,



గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు దోహదపడతాయని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు,ట్రాఫిక్ నియంత్రణ,భద్రత తదితర సౌకర్యాలను కల్పించి భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. గ్రామ యువకులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సహాయం అందించారు.
కమిటీ సభ్యులు మాట్లాడుతూ,ఈ కళ్యాణ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యుల బంధువులు భారీ ఎత్తున తరలివచ్చారు. భక్తుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కళ్యాణ సందర్భంగా గ్రామం అంతా జాతర లాగా జనసముద్రం అయింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు,మాజీ కౌన్సిలర్లు,కుల పెద్దలు,గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులతో తొర్రూరు గ్రామం సందడిగా మారింది.

# ఘనంగా బీరప్ప స్వామి కామరాతి దేవి కళ్యాణ మహోత్సవం





**హయత్ నగర్,(ప్రజావినికిడి):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తొర్రూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ బీరప్ప స్వామి కామరాతి దేవి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవాలయం వద్ద ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేసి,వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.
ఈ మహోత్సవానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల అభివృద్ధి శాఖ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అభిషేక్ రెడ్డి,అన్ని పార్టీల స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు దోహదపడతాయని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు,ట్రాఫిక్ నియంత్రణ,భద్రత తదితర సౌకర్యాలను కల్పించి భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. గ్రామ యువకులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సహాయం అందించారు.
కమిటీ సభ్యులు మాట్లాడుతూ,ఈ కళ్యాణ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యుల బంధువులు భారీ ఎత్తున తరలివచ్చారు. భక్తుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కళ్యాణ సందర్భంగా గ్రామం అంతా జాతర లాగా జనసముద్రం అయింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు,మాజీ కౌన్సిలర్లు,కుల పెద్దలు,గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులతో తొర్రూరు గ్రామం సందడిగా మారింది.

# ఎల్లంపల్లి గ్రామంలో ఎల్లమ్మ,బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో ఎల్లమ్మ,బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, బొడ్రాయి ప్రతిష్టాపన గ్రామానికి దిష్టి తగలకుండా,చెడు శక్తులు ప్రవేశించకుండా రక్షణ కల్పిస్తుందని మనందరి నమ్మకమని ఎల్లమ్మ తల్లి అనుగ్రహంతో గ్రామ ప్రజలకు మంచి జరగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి సర్పంచ్ భవాని సుజాతమల్లేష్, మొగిలిగిద్ద సర్పంచ్ బుగ్గ క్రిష్ణ,మాహదేవ్ పూర్ సర్పంచ్ అనుషా రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ మహేష్ యాదవ్,వార్డు సభ్యులు బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం,శంకరయ్య గౌడ్,శివ,మల్లేష్, వేణు యాదవ్,ఆనంద్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ టౌన్,ఫరూక్ నగర్ లో 198 మంది లబ్ధిదారులకు

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కుల పంపిణీ





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం,హాజరైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,కాంగ్రెస్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు,గ్రామ సర్పంచుల సమక్షంలో చెక్కులు అందుకున్న గ్రామీణ లబ్ధిదారులు.కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని షాద్ నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంతో పాటు ఎంపీడీవో సమావేశ మందిరంలో వేరువేరుగా కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.షాద్ నగర్ టౌన్ లో 64, ఫరూక్ నగర్ లో 134 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా అందజేశారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందేమోహన్
కాంగ్రెస్,బిఆర్ఎస్ కౌన్సిలర్లు రాజు నాయక్,ఎస్పీ శివ, గోపాల్,పెంటయ్య తదితరులు,వెల్జెర్ల గ్రామ సర్పంచ్ బాబు నాయక్, లింగారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ ప్రవీణ్,ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ,దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక చేయూతనందించే బృహత్తర పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.వేలాది మంది పేద,మధ్య తరగతి కుటుంబాలకు షాదీ ముబారక్,కళ్యాణ లక్ష్మీ పథకాల ద్వారా ఒక లక్షా నూటపదహారు రూపాయలు అందించడం జరుగుతుందన్నారు.ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక చేయూతనందిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ తహసిల్దార్ నాగయ్య,కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి,సుదర్శన్ గౌడ్, బాలరాజ్ గౌడ్,రాయికల్ శ్రీనివాస్,పురుషోత్తం రెడ్డి, ముబారక్ అలీ ఖాన్,యాదగిరి యాదవ్,జంగారి రవి,జంగారి జంగయ్య,సోలిపూర్ అనిల్, నల్లముని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు సహాయక పరికరాలను అందజేసిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సి డబ్ల్యూ ఎస్ ఎన్) కోసం నిర్వహించిన అలిమ్కో సహాయ మరియు ఉపకరణాల పంపిణీ శిబిరం
కార్యక్రమం సోమవారం రోజు సరూర్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించబడిందఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు, సహాయక పరికరాలను అందజేశారు.వారి విద్యాభివృద్ధి, స్వయం ఆధారిత జీవనం అదేవిదంగా సాధారణ జీవన విధానంలో మరింత సౌలభ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు.సమగ్ర శిక్ష తెలంగాణ ద్వారా వారికి అవసరమైన సేవలు,విద్యా సహాయం అలాగే ఉపకరణాలు అందించేందుకు ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు.అనంతరం పలువురు చిన్నారులకు సహాయక పరికరాలను స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# గుప్త నిధుల కోసమే శివాలయం కూల్చివేత: హరీశ్‌రావు

**అర్ధరాత్రి 24 అడుగుల తవ్వకాలు చేశారని ఆరోపణ**

**ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో రూ.500 కోట్ల కుంభకోణమని విమర్శ**

**అశోక్‌నగర్‌లో ధ్వంసమైన కాకతీయుల ఆలయ పరిశీలన**



**నర్సంపేట/, మే 11 (ప్రజావినికిడి):**
ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో 800 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయుల నాటి మట్టికోట శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. సోమవారం ధ్వంసమైన ఆలయాన్ని సందర్శించిన ఆయన స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం గుప్తనిధుల కోసం అర్ధరాత్రి తవ్వకాలు జరిపిందని విమర్శించారు.
"స్కూల్ నిర్మాణం కోసం అయితే పగలే పనులు చేయవచ్చు. రాత్రి 12 గంటల నుంచి 1 గంట మధ్య గర్భగుడి కింద 24 అడుగుల లోతు వరకు ఎందుకు తవ్వారు?" అని ప్రశ్నించారు. ఇది గుప్తనిధుల వేటేనని, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే ఈ చర్యలు జరిగాయని ఆరోపించారు.
పురావస్తు శాఖ జిల్లా అధికారి ఈ నెల 7న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తవ్వకాలకు ఉపయోగించిన యంత్రాలను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
"దేవాలయ భూమి ప్రభుత్వ భూమిగా ఎలా మారింది?"
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణిలో దేవాలయ భూమిగా నమోదైన స్థలం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూభారతిలో ప్రభుత్వ భూమిగా ఎలా మారిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. స్కూల్ నిర్మాణానికి చుట్టుపక్కల విస్తారంగా స్థలం ఉన్నప్పటికీ గుడి ఉన్న ప్రదేశాన్నే ఎందుకు ఎంపిక చేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు.
1958 పురావస్తు చట్టం ప్రకారం వందేళ్లు దాటిన కట్టడాలు పురావస్తు శాఖ పరిధిలోకి వస్తాయని, ఈ చారిత్రక ఆలయాన్ని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని కోరారు.

**"టెండర్లలో భారీ అవినీతి"**

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 76 స్కూళ్ల టెండర్లు అన్నీ 4.86 నుంచి 4.99 శాతం ఎక్సెస్‌తోనే మంజూరు చేశారని తెలిపారు. ఒక్క టెండర్ కూడా మైనస్‌కు వెళ్లకపోవడం వెనుక భారీ అవకతవకలు ఉన్నాయని విమర్శించారు.నర్సంపేట ప్యాకేజ్-8 కింద రూ.136 కోట్ల పనిని రూ.142 కోట్లకు అప్పగించారని, ఈ విధంగా దాదాపు రూ.494 కోట్ల ప్రజాధనం దోపిడీ జరిగిందన్నారు. కాంట్రాక్టర్లు తన మనుషులేనని సీఎం ఆరోపిస్తే వెంటనే టెండర్లు రద్దు చేయాలని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, వినయ్‌భాస్కర్, ఆరూరి రమేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రేస్



**ముషీరాబాద్,(ప్రజావినికిడి):**పార్లమెంటులో మహిళలకు ౩౩ శాతం బిల్లును ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెడితే ఆ బిల్లును కాంగ్రేస్ పార్టీ వాళ్లు అడ్డుకున్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అథావలె జాతీయ సెక్రటరీ పేరం శివ నాగేశ్వరావ్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అధినీయం బిల్లును ప్రవేశ పెడితే మహిళలు ఎంతో హర్షించారు. కానీ ప్రతి పక్షాల పార్టీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకించడంతో ఆగ్రహించారు. మహిళల అభివృద్ధిని కొన్ని రాష్ట్రాలు ఓర్వలేక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ దేశ అభివృద్ధికి మహిళలు ఎంతో కీలకమని అన్న మాటలు గుర్తు చేశారు.నాడు ఇందిరా గాంధీ కాంగ్రేస్ పార్టీలో ఉండి 18 ఏండ్లు పరిపాలించలేదాని ప్రశ్నించారు. ఇప్పటికైనా వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లును పెట్టి దానికి మద్దతు పలుకాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉండదని హెచ్చరించారు.ఈ ధర్నాలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ నాయకులు డాక్టర్ సంఘం శ్రీధర్, రాష్ట్ర నాయకులు దాచారపు శ్రీనివాస్,రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డి రవికుమార్,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్పీ నీల, పొలిటికల్ ఉమెన్స్ అధ్యక్షులు గంగాపురం పద్మ, జగన్నాథం రాజిరెడ్డి, అసేంట్ ఓనర్ సెక్రెటరీ ఎన్ ఆర్ సి రాజు, ఏఐఆర్ఆర్టీ సెక్రెటరీ నర్సింగ్ రావు,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాంబ,పుష్పలత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# సువేందు పిఎ హత్య కేసులో పురోగతి

## పోలీసుల అదుపులో బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లకు చెందిన ముగ్గురు



**కోల్‌కతా, మే 11 (ప్రజావినికిడి):**
పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్య కేసులో పురోగతి సాధించారు పోలీసులు. బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ నిమిత్తం అర్ధరాత్రి వేళ బెంగాల్‌కు తరలించినట్టు సమాచారం. నిందితులలో ఒకరు టోల్ ప్లాజా వద్ద యూపీఐ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు చేయడంతో దర్యాప్తు అధికారులు వారి కదలికలను గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు బిహార్‌లోని బక్సర్‌కు చెందినవారు కాగా, మరొకరు యూపీలోని బల్లియా వాసి. అయితే.. అతను కూడా బక్సర్‌లోనే నివసిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాగా.. బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ నెల 6న రాత్రి.. సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. కోల్‌కతా నుంచి తన స్కార్పియో వాహనంలో వెళుతున్న చంద్రనాథ్‌ను డోరియా రహదారిపై హత్య చేశారు. ఆయన వాహనాన్ని ఓ కారు అకస్మాత్తుగా ఓవర్ టేక్ చేయగా బైక్‌పై ఉన్న నిందితులు కారు ఎడమవైపు నుంచి వచ్చి నేరుగా చంద్రనాథ్‌పై కాల్పులు జరిపడంతో ఆయన మృతిచెందారు. ఈ ఘటనలో రథ్ డ్రైవర్‌కు కూడా బు÷-లలెట్ తగలడంతో గాయాలయ్యాయి. ఆయన్ను కోల్‌కతా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

# దస్తగిరి హత్య కేసులో లొంగిపోయిన నిత్యానందరెడ్డి



**కడప, మే 11 (ప్రజావినికిడి):**
వైసీపీ నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య కేసులో నిత్యానంద రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారు. గత 20 రోజులుగా వైసీపీ నేత కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పోలీసులు గాలిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఎదుట నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. కొద్దిరోజుల క్రితం కడపలో వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి దారుణ హత్యకు గురయ్యారు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దాదాపు 11 మందిని అరెస్ట్ చేశారు. నిత్యానంద రెడ్డి చెప్పడం వల్లే దస్తగిరిని చంపినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ కేసులో నిత్యానంద రెడ్డిని ప్రధాన నిందితుడిగా పోలీసులు చేర్చారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిత్యానందరెడ్డి నివాసంలో సోదాలు జరిపిన పోలీసులు.. విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

# కైలాసగిరిపై త్రిశూల్ ఏర్పాటు శుభపరిణామం

## 'స్వాభిమాన్ పర్వ' కార్యక్రమంలో బిజెపి అధ్యక్షుడు మాధవ్

**విశాఖపట్నం, మే 11 (ప్రజావినికిడి):**
విశాఖలోని కైలాసగిరిపై త్రిశూలాన్ని ఏర్పాటు చేయడం ఒక శుభ పరిణామమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. నగరంలోని కైలాసగిరి వేదికగా జరిగిన 'స్వాభిమాన్ పర్వ' కార్యక్రమం ఆధ్యాత్మికత, జాతీయ భద్రత అంశాల కలయికగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పి.వి.ఎన్ మాధవ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొని, దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిణామాలు, సాంస్కృతిక పునరుజ్జీవనంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్ మాధవ్ మాట్లాడుతూ.. 'సింహాచలం క్షేత్రంలో భాగమైన కైలాసగిరిని ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్ట్ అభినందనీయం. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ స్వాభిమాన్ జాగరణ కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, దేశ రక్షణ అంశాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తోంది.




గత పన్నెండేళ్ల కాలంలో పఠాన్‌కోట్ మినహా దేశంలో పెద్దగా ఉగ్రవాద ఘటనలు చోటుచేసుకోకపోవడం.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో అంతర్గత భద్రత ఎంత పటిష్టంగా ఉందో నిరూపిస్తోంది. ముఖ్యంగా 'ఆపరేషన్ కగార్' ద్వారా దేశవ్యాప్తంగా తీవ్రవాద ఏరివేత పక్రియ వేగవంతంగా సాగుతోంది. ఎన్డీయే హయాంలో దేశ సరిహద్దులు మరింత సురక్షితంగా మారాయని అన్నారు.

# ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు..

## తెలంగాణకు ఏం ఇచ్చారు?: పొన్నం ప్రభాకర్

**మే 11 (ప్రజావినికిడి):**
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని విస్మరించడమేనని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు.



తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

# రాజకీయ పార్టీల్లో సర్ భయాలు !

**మే 11 (ప్రజావినికిడి):**
సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే సర్ ప్రక్రియ మొదుల కానుంది. దీంతో ఓటర్ల ఏరివేత చేపడతారు. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ సాగింది. ఇప్పుడు ఎపి, తెలంగాణలో సాగనుంది. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశాయి. బూత్ లెవల్లో అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించాయి. దీనినిబట్టి వీరి ఆందోళన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. నిజంగానే అవసరమే. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట్రాల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న.సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీలు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్‌లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే



ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉన్నప్పుడు. కూడా తొలగించడం సరైన చర్యనే. ఉమ్మడి ఎపిలో ఆంధ్రావాళ్లవి తెలంగాణలో కూడా ఓట్లు ఉండేవి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఇటీవల ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. ఇందులో బంగ్లా నుంచి దొంగచాటుగా వచ్చిన వారే 90శాతం మంది ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్‌ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చు. ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాగలిగితే ఇక పంచాయితీయే ఉండదు.

ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. ప్రజాస్వామ్య పక్రియను పూర్తిగా పటిష్టం చేయగలుగుతాం. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి అధునాతన ఆలోచనలకు పూనుకోవాలి. అప్పుడు ప్రక్షాళనతో పిలేకుండా మరణించిన వారి పేర్లను తొలగించటం సులభం కాగలదు. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒకే ఓటు కలిగి ఉండేలా పక్కాగా ఓటరు కార్డును రూపొందించాలి. ఓటుకు పక్కాగా ఆధ్యార్ తరహాలో నంబర్ కేటాయించాలి.

ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన రాజకీయ పార్టీల్లోనే లేదు. అందువల్ల ముందుగా పక్కాగా ఓటు నమోదు జరగాలి. దానికి పక్కాగా కార్డు ఉండాలి. నంబరుతో కూడిన ఆధార్, పాన్ తరహా కార్డులను జారీచేయాలి. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయ.

# పారిశ్రామిక ప్రగతిలో సిఐఐ కీలకం

**పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక**
**పశ్చిమాసియా యుద్ధంతో సంక్షోభ పరిస్థితులు**
**ప్రధాని మోడీ మిషన్ దేశానికి అవసరం**
**అందరం కూడా దానిని అనుసరిస్తే మంచిది**
**సవాళ్లను అధిగమించే సమయం ఇదే**
**సిఐఐ సదస్సులో ఎపి సిఎం చంద్రబాబు**




**న్యూఢిల్లీ, మే 11 (ప్రజావినికిడి):** పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొన్ని అంశాలతో ప్రధాని మోదీ జాతీయ మిషన్‌ను ప్రకటించారు. ప్రధాని మిషన్‌ను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రధాని టాస్క్ మాత్రమే కాదు, మనందరిది. సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళు_న్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత పరిశ్రమల ప్రోత్సాహానికి సీఐఐ సరైన వేదిక అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సీఐఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రభుత్వాలు ఎకో సిస్టమ్‌ను మాత్రమే సృష్టిస్తాయని, ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ది లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్



తమిళనాడు ముఖ్యమంత్రిగా నటుడు విజయ్ ప్రమాణస్వీకారం చేయగా, ఈ కార్యక్రమానికి ఆయన రూమర్డ్ గర్ల్‌ఫ్రెండ్, నటి త్రిష కృష్ణన్ హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నిన్న చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ వేడుక తర్వాత త్రిష సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన తన ఫొటోలను షేర్ చేస్తూ, "ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది" అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ క్యాప్షన్ వారిద్దరి మధ్య ఉన్న సంబంధంపై జరుగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.
వేడుక కోసం త్రిష సీఫామ్-గ్రీన్ రంగు చీరలో, బంగారు వర్ణం మోటిఫ్స్ ఉన్న బ్లౌజ్‌తో సంప్రదాయబద్ధంగా ముస్తాబయ్యారు. తలలో తెల్లటి గజ్రా, ఎరుపు రాళ్లతో కూడిన ఆభరణాలతో ఆమె అందరి దృష్టిని ఆకర్షించారు. కాగా, విజయ్, త్రిష తమిళ చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన జోడీలలో ఒకటి. గతంలో 'గిల్లీ', 'తిరుపాచ్చి', 'ఆతి', 'కురువి', ఇటీవల వచ్చిన 'లియో' వంటి చిత్రాల్లో కలిసి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.

కొంతకాలంగా వీరిద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తోందని సోషల్ మీడియాలో ఊహాగానాలు వస్తున్నప్పటికీ, ఇద్దరూ ఎప్పుడూ స్పందించలేదు. విజయ్ విడాకుల పిటిషన్‌కు సంబంధించిన వార్తలు బయటకు వచ్చిన తర్వాత ఈ వదంతులు మరింత ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న చారిత్రక ఘట్టానికి త్రిష హాజరుకావడం, ఆ తర్వాత ఇప్పుడు ఆమె పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది.



# మోదీని కలిశా.. నా జన్మ ధన్యమైంది

## : తనికెళ్ల భరణి ఎమోషనల్ పోస్ట్


ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రధాని నరేంద్ర మోదీపై తనకున్న అభిమానాన్ని చాటుతూ చేసిన ఓ ఎమోషనల్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మోదీలో తనకు రాముడు, కృష్ణుడు వంటి మహనీయులు కనిపిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.
ఈ సందర్భంగా భరణి తన పోస్టులో "నేను రాముణ్ణి చూడలేదు, కృష్ణుణ్ణి చూడలేదు, ఆదిశంకరుల్ని చూడలేదు, వివేకానందుణ్ణి చూడలేదు. అంటే చూడలేము కూడా. కానీ, వాళ్లందరి అంశలతో ఉన్న మోదీ గారిని చూశాను, ముట్టుకున్నాను, చేతిని ముద్దెట్టుకున్నాను. నా జన్మ ధన్యం" అని పేర్కొన్నారు. తాను చూడని దైవ స్వరూపాలను, మహనీయుల అంశలను ప్రధాని మోదీలో చూశానని భరణి అభిప్రాయపడ్డారు. కేవలం ఆయన్ను చూడటమే కాకుండా, తాకడం, ఆయన చేతిని ముద్దాడటం ద్వారా తన జీవితం సార్థకమైందని ఆయన తన భావోద్వేగాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం తనికెళ్ల భరణి చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# వారణాసికి బయలుదేరుదాం

## హీరోయిన్ ప్రియాంక ఆసక్తిక పోస్ట్



ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.





# మెగా మేనియాకు తెరలేచింది!

## 'పెద్ది' ట్రైలర్ డేట్ ఫిక్స్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేయడంతో సోషల్ మీడియాలో సందడి మొదలైంది.
'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఒక రోజు ముందుగా, అంటే జూన్ 3న ప్రీమియర్ షోలు కూడా ప్రదర్శించనున్నారు. విభిన్నమైన కథాంశంతో, భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా సినిమాగా 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు రానుంది.


# మరోసారి అదే ఫార్ములాతో అనిల్



టాలీవుడ్‌లో కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన డైరెక్టర్ అనిల్ రావిపూడి మరోసారి తన స్పీడ్ ప్లానింగ్‌తో ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అవుతున్నారు. విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ మల్టీస్టారర్ మూవీకి సంబంధించిన తాజా సమాచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. జులై నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ ప్రాజెక్ట్‌ను అనిల్ రావిపూడి గత సినిమాల మాదిరిగానే అత్యంత వేగంగా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాడన్న వార్తలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు సంగీతాన్ని జీవీ ప్రకాష్ కుమార్ అందించనున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్స్ దాదాపు పూర్తయ్యాయని, పాత్రల డిజైనింగ్‌తో పాటు షూటింగ్ ప్లానింగ్ కూడా క్లియర్‌గా సిద్ధమైందని టాక్ వినిపిస్తోంది. జులైలో షూటింగ్ ప్రారంభించి నవంబర్ లేదా డిసెంబర్ నాటికి టోటల్ షూట్ కంప్లీట్ చేయాలనే టార్గెట్‌తో టీమ్ ముందుకు వెళ్తోందట. ఒక కమర్షియల్ మల్టీస్టారర్ సినిమాను కేవలం ఐదు నుంచి ఆరు నెలల్లో పూర్తి చేయాలనుకోవడం చిన్న విషయం కాదు. అయితే అనిల్ రావిపూడి వర్కింగ్ స్టైల్‌ను పరిశీలిస్తే ఇది అసాధ్యంగా కనిపించడం లేదు. గతంలో కూడా ఆయన చాలా తక్కువ సమయంలో సినిమాలను పూర్తి చేసి రిలీజ్ చేసిన ట్రాక్ రికార్డ్ ఉంది. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రధాన బలం ఫన్ ఎలిమెంట్స్ అని తెలుస్తోంది. స్క్రిప్ట్ స్టేజ్ నుంచే ఎంటర్‌టైన్మెంట్ అద్భుతంగా వర్కౌట్ అయిందని, డైలాగ్స్‌తో పాటు సిచ్యువేషనల్ కామెడీ కూడా సినిమాకు మెయిన్ ఎట్రాక్షన్ గా నిలుస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా వెంకటేష్ కామిక్ టైమింగ్, కళ్యాణ్ రామ్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిసొస్తే తెరపై కొత్త తరహా ఎంటర్‌టైన్మెంట్ కనిపించే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. అనిల్ రావిపూడి స్టైల్‌కు తగ్గట్టుగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూనే మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా కథను డిజైన్ చేసినట్టు టాక్. ఇక ఈ ప్రాజెక్ట్ వేగంగా పూర్తవుతుండటంపై ఇండస్ట్రీలో మరో ఆసక్తికర చర్చ కూడా జరుగుతోంది. సాధారణంగా మల్టీస్టారర్ సినిమాల్లో డేట్స్ మేనేజ్‌మెంట్, ఆర్టిస్టుల కాల్షీట్స్, ప్రొడక్షన్ స్కేల్ కారణంగా షూటింగ్ ఎక్కువ కాలం పడుతుంది.

# విశ్వంభర పై భారీ అంచనాలు

## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు



మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

-------------

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613